ప్రశ్నించారు. ఆంధ్రఛేంబరు కడచిన పాతికేండ్ల నించి మద్రాసులో ఉంది. ఇప్పుడాంధ్రరాష్ట్రం ఏర్పడినాకూడా మద్రాసులోనే ఉంటుంది అని చెప్పి- ఇలాంటి వ్యర్థప్రసంగాలుచేయడం ఆచార్యులుగారి కొంటెతనాన్ని తెలియజేస్తుందని చూచాయగా అంటించారు.

ఆంధ్రజాతిలో క్రమశిక్షణలేదనడానికి మరో నిదర్శనం. ఈ సభలోనే నృత్యప్రదర్శనలు జరిగాయి- రాధాకృష్ణన్‌గారు ఆ గంటన్నరసేపు కదలకుండా చూచారు, విన్నారు, ఆనందించారు. అమాయికమయిన ఈప్రదర్శనలు ఆయనకి వినోదం కలిగించాయన్నారు. ఆ నృత్యంలో కుమారి రాధ, కల్పకం, అన్నపూర్ణ-భరతనాట్యం ప్రదర్శించారు. ఆంధ్ర అడ్వొకేటు జెనరల్ దువ్వూరి నరసరాజు గారి కుమార్తెలు. మంచిదే. వారి తండ్రిగారి పేరు చెప్పవలసిన అగత్యంలేదు. ఆ పిల్లలు చేసిన ప్రదర్శనంలో- ఏడేండ్లబాలిక అన్నపూర్ణచేత ఒక జావళీ అభినయింపజేశారు. "పంతముగల పంకజముఖినీ పెనగినందుకు, ఎంతటి కులుకే" అని ఆపాట. చిన్నపిల్లలకు అర్థంగాని పచ్చి శృంగారం అభినయింపజేసి - చూచినవారిని చేసినవారిని బాధపెట్టడంతప్ప దీనివల్ల కలిగిన ప్రయోజనం శూన్యం! ఇది అభినయిస్తూ ఉన్నంతసేపు ప్రేక్షకులలో గోల! ఇదంతా హర్షం అనుకున్నవారు లేకపోలేదు.

అలాగే రాధాకృష్ణనృత్యంలో రాధ, కల్పకం మధురానగరిలో అనే పాటకూడా అసభ్యంగా ఉంది. శృంగారం - దానికితోడు అభినయం రసవంతంగాలేక - చాలమోటుగా ఉన్నది. అయినా సభ్యజాతి మౌనంగా ఆనందించ వలసిందే. క్రమశిక్షణలేని మనజాతి చాల అలజడిచూపారు.

ఆంధ్రప్రశస్తిని చరిత్రాత్మకమైన రూపకముల పరంపరగా ప్రదర్శించిన మరొకనాటిక-ఆంధ్రశ్రీ. మల్లంపల్లి సోమశేఖరశర్మగారు రచించిన యీ రేడియో నాటిక-ఆంధ్రబాలానందసంఘంవారు- నలభైమంది నటీనటులతో చక్కగా ప్రదర్శించారు. ఈ నాటకములోని కొన్ని రంగములలో నాట్యప్రదర్శనం జరిగింది. ముఖ్యంగా కృష్ణదేవరాయలవారి కొలువులో కుమారి టి. శ్యామల నృత్యప్రదర్శనంలో తిరిగిఅదే మధురానగరిపాట అభినయించారు. అపస్వరంతోకూడిన మగగొంతుకతో ఈ పాట పాడుతూ ఉండగా-మొరటుగా, కసరత్తుచేసినట్లు చేసిన యీ నాట్యం - చూచే సభాసదులకు ఎంతో బాధకలిగించింది. ఏ క్షణానికి ఆ క్షణం గోడమీదనుండి క్రిందకి పడిపోయే వాడినిచూచినట్టు భయం, జుగుప్స, తలవంపులు. మన ఆంధ్రసంస్కృతిని మరొకరికి చక్కగా ప్రదర్శించదలచినప్పుడు —— అందులోని నిగ్గునే చూపడానికి యత్నించాలి. ఇటువంటి సమావేశాలలో ఏ పొరపాటు జరిగినా ప్రత్యేకవ్యక్తుల ఆడంబరాలవల్ల మనజాతికీ, మనసంస్కృతికీ తీరని తలవంపులువచ్చి, చెరుపరాని మచ్చగా నిలిచిపోతుందన్నమాట మరచిపోవద్దు.

మనవాళ్లు క్రమశిక్షణలేనివాళ్ళేకాకఏదిమంచో ఏదిచెడ్డో గ్రహించలేక - స్వస్వరూప పరిజ్ఞానం లేని నిస్సహాయులా అనిపిస్తున్నారు. మనవాళ్లు వట్టి -- ఏమనాలో తెలియక వొట్టి మంచివాళ్లు అనేస్తాను.

స్కెచ్

# తారకమంత్రం

వెంపటి శంభుప్రసాద్

సూర్యాస్తమయం అవుతూఉంది. ఎర్రని కిరణాల కాంతికి బీచిలోని ఇసుక-అసలే ఎర్రగా ఉండేది-ఇంకా ఎర్రనయింది. సముద్రంలో నుంచి అలలు ఒకటిపైఒకటి వస్తున్నాయి. మళ్ళీ అలలు వస్తున్నాయి అలాగే అవుతున్నాయి.

ఎదురుగానున్న సముద్రంలాగేఉంది గోపాలం బుర్ర. సంక్షోభం అచట నివాస మేర్పరచుకొంది. సముద్రములోని అలలలాగే అతని ఆలోచనలు ఒకటిపై ఒకటి వస్తున్నాయి. భగ్నమవుతున్నాయి. ఒకదాన్ని నెట్టి ఒకటి ఆ స్థానాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్నాయి.

వాడసలు కర్కోటకుడు; పాషాణహృదయం

వాడిది. దయ ఏకోశానాలేదు. పొట్ట పగలదీసినా కరుణ కనిపించదు. శుష్కప్రియురాలు శూన్య హస్తాలును. అసలు వాడిదగ్గర పనిచేసినంత బుద్ధి తక్కువ ఇంకోటివుందా! ఏంచేస్తాడు చేయక? గతో! పోనీ రాజీనామా ఇస్తే..." ఈ ఆలోచన రాగానే అతని హృదయం ఝల్లుమంది. వెనకాల ఎంతమంది ఉన్నారు. తను రాజీనామాచేస్తే వాళ్ళగతేమవుతుంది? ఎట్లా కళ్ళల్లోనీళ్ళు గిర్రున తిరిగాయి. హృదయం వణికిపోయింది.

"ఇంతకీ తనొక్కడే నా బాధపడేది. తనతోపాటు ఇంకా పనిచేస్తున్నారే చాలమంది వాళ్ళకీపాటులేదూ!"

వాడికెంతపొగరు. ఎంతనిర్లక్ష్యము. ఎంత నటన? ఎంతకైతవము? ఎంతప్రేమ ఎంతజాలి? ఆహా! నిజంగా తనజీవితంలో అలాంటి వ్యక్తిని చూడలేదు.

ఒకరోజు శెలవుకోసం వెళ్ళాడు. ఏమన్నాడు "శలవా? కావాలా? ఎట్లా? వీల్లేదే! ఆఫీసు ఇన్స్పెక్షను దగ్గరికొస్తోంది" అన్నాడు. అంత వరకు బాగానేఉంది.

"మరి నాకర్జంటు పనుందండీ నాచెల్లెలుకి జ్వరంవచ్చిందట. ఇంట్లో ఉన్నవాళ్ళు నాన్న అమ్మ ముసలివాళ్ళు. ఇవాళ వెళ్ళితే రేపు ఆది వారమేగాబట్టి ఎల్లుండి వస్తానండి" అన్నాడు. అంటే విన్నాడూ! 'జ్వరం ఏంచేస్తుందిలే. పెద్ద యీమాత్రం దానికి నీవువెళ్ళాలా" అంటాడు. వాడికాదుర్దా ఎందుకుంటుంది? మొన్న కుమొన్న తన కూతురుకు పడిశం ఒట్టి పడిశంపట్టి దగ్గువస్తే క్షయేమోనని మదనపల్లి వెళ్ళాడే! పక్షంరోజులు శెలవుపెట్టి మరీ. ఏం తనకేనా యేం ఆదుర్దాలేంది? మరి నేనొక్కరోజేగా సెలవు అడిగింది. ఈమాత్రానికే తను కాదనాలీ! తనకు కోపంరాదూ! అందుకే అంతపనీచేశాడుతను. ఏమండీ నాకయితే పనుంది. మీ ఇష్టం సెలవు గ్రాంటుచేస్తేచెయ్యండి లేకపోతే లేదు అన్నాడు.

మొన్న ఇటీవల యింటికి కబురంపించాడే. ఏం మూడిందో అనుకున్నాడు తను. కాఫీ యిచ్చికూచోబెట్టి చక్కగా మాట్లాడాడు తేనె బూసిన కత్తిలాగా! ఏవో ఆఫీసులో పూర్తిచేయవలసినవి చెప్పాడు. ఎట్లా పూర్తిచేయాలో చెప్పాడు. ఇంతకీ తన ఎక్కౌంట్లు పూర్తిచేయించుకున్నాడు. ఎంత నటనచేశాడు, ఎంత మాయప్రేమువలకపోశాడు తనమీద. రామయ్య తనకు చెప్పనేచెప్పాడు వాడు వట్టి కపటుడని. అందుకే వాణ్ణిగురించి జాగ్రత్తగా ఉంటున్నాడు. నిజంగా రామయ్యం ఎంత మంచివాడో!

అంతమంచివాడిమీద మొన్న విరచుకపడ్డాడే. ఎన్నిమాటలన్నాడు నీకసలక్షరాలు రావన్నాడు, అంకెలు రావన్నాడు, ఎక్కాలంతకంటే రావన్నాడు, నీకు జీతం దండగన్నాడు. (పెద్ద తను జీతం ఇచ్చేవాడిలాగా! తనే జీతం ఇచ్చేటట్టయితే వీలయితే తను జలగక్రింద మారి రక్తం పీల్చేవాడే! ఆ అంతపనీ చేస్తాడు. వీల్లేకగాని) నీ అంతుచూస్తానన్నాడు. ఇదంతా ఎందుకంటా అంటే కేవలం ఓ కూడిక తప్పుకూడాట్ట. అదీ సంగతి. మరి పొరపాటు మానవుడికి కాకపోతే మెషీనుకు వస్తుందా! అందరం మానవులమేగా! ఆమాత్రం సహనం ఉండొద్దూ. కేవలం పొరపాటుకేఅంతమాటలా! తను తప్పుచేయదూఎన్నడూ?

మొన్న ఏమయింది. ఏదో రిపోర్టు తప్పు పంపించాడట. ఆఫీసులో పనిచేసేవాళ్ళెంతమందీ అంటే 14గురికి 10మంది అని పంపాట్ట. అది తిరిగొచ్చిందట. అది తప్పుగాదూ? ఏం తను ఆఫీసులో హెడ్డైవుండి ఆమాత్రం తెలియదేం. అది పొరపాటయింది. రామయ్య చేసింది అమాంతం నేరం అయింది.

ఇవ్వాళ ఏమయిందీ. తనేమయినా తప్పుచేశాడా. ఊరికనే ఏదో రాస్తున్నాడు. రాస్తూ ప్రక్కనున్న గుమాస్తా వెంకటేశ్వరరావుని పిలిచి కొంచెం లెడ్జరుపోస్టింగ్సువేస్తాను చెప్పండన్నాడు ఇదే తప్పా? ఆఫీసులో ఉన్నవాడల్లా వచ్చి మీ పని మీరు చేయండి అంటాడు. నేనేం డ్యూటీ తప్పుచేశానని. వళ్ళు మండదూ తనకట్లా అంటే? ఇంతకీ తను డ్యూటీ సరిగాచేస్తున్నాడూ? కిందటి నెలలో ఒకటి రెండుగ్రామాలకు విజిటుకు వెళ్ళాడట. అయిదురోజులు డ్యూటీమీద వెళ్ళినట్టు వేసికొన్నాడు. ఇంక రెండురోజులు అలస్యంగా వచ్చి రెండురోజులూ చేసికొన్నాట్ట. ఇంతకీ ఆఫీసుపని రెండురోజులే చేశాట్ట. ఇంకా చెప్పా

లంటే లక్ష ఉన్నాయన్నారు రామయ్య వెంకటేశ్వరరావులు. తను ఆయనని అవే మాటలు అంటే ఆయనకు యెల్లా ఉంటుంది? అననే అన్నాడు. "నా డ్యూటీ మీరు జ్ఞాపకం చేస్తానంటారా! చేయండి" అని. ఏమయింది. అగ్గిబరాటా అయ్యాడు.

దానిమీద రిపోర్టు వెళ్లిందట. పొగరుబోతు అనీ, అశ్రద్ధ అనివ్రాశాట్ట. నాకివన్నీ రామయ్య చెప్పి తనకు తెలిసినవన్నీ చెప్పాడు తనకు.

గోపాలం బుర్రలో ఈ ఆలోచనల కంతు లేకపోయింది. ఎప్పుడు పొద్దుగూకిందో తెలియలేదు. ఇప్పుడు గోపాలం హృదయంలో దిగులు ఆవరించింది. కొంపదీసి ఆ రిపోర్టుతో ఉద్యోగం ఊడదుగదా! అని. తల్లి, తండ్రి, చెల్లెలు అతని మనోఫలకంపైకి వచ్చారు. వాడి ముఖం యీ ముగ్గురినీ తోసి స్థానం ఆక్రమించుకుంది. గోపాలం నిశ్చయానికొచ్చాడు. ఏమయినా ఆఫీసరును (వాడిని) క్షమాపణవేడి ఇకముందు వాడేమన్నా తనుమాత్రం మాట్లాడకుండా ఉందామని.

గోపాలంలేచి నడిచాడు. అతని కాళ్ళు త్వరగా నడుస్తున్నాయి. అంతకంటే వేగంగా అతని బుర్ర పనిచేస్తుంది. ఒక ఇంటిముందు ఆగాడు గోపాలం. ఇంట్లోవరండాలో ఒక పడకకుర్చీలో ఓ లావుపాటి ఆయన ఉన్నాడు. ఆయన సగం నెరసిన బొద్దు ఫ్రెంచిమీసాల కటింగు చూస్తేనే ఇంతకీ ఆ గోపాలం "వాడు" అని తెలుసుకోవచ్చు. గోపాలం లోపలికి వెళ్ళాడు.

ఆ బొద్దు మీసాలు కొంచెము పొడుగు సాగాయి, వెడల్పు తగ్గాయి. పళ్లు బయట పడ్డాయి. అంతే ఆయన సుందర ముఖారవిందం పై ఓ చిన్ననవ్వు వెలిసింది. గోపాలానికిది శుభ శకునంగా కనిపించింది. "ఏమోయ్ ఏదోపనిమీద వచ్చినట్టున్నావు ఏమిటి సంగతి?" అన్నాడు.

"ఏంలేదండీ ప్రొద్దుట నేను చాలా తొందర పడ్డాను. నేను క్రొత్తగా ఉద్యోగంలో చేరాను గదండీ నాకు అనుభవంలేదండీ. పొరపాటయిందండీ. నేను బీదవాణ్ణండీ మీరు రిపోర్టు పంపారట. ఇంక నాకీఉద్యోగం లేకపోతే పస్తేనండీ. మీకుక్షమాపణచెబుదామనివచ్చానండీ" అన్నాడు.

ఆఫీసరు హృదయం ఆర్ద్రమయిందని ఆయన నేత్రాల ఆర్ద్రత్వాన్ని బట్టి తెలుస్తుంది. "అబ్బాయి! నీకింకా అనుభవంలేదు. నేనేం రిపోర్టు పంపలేదు పంపను. ప్రొద్దుట జరిగింది నా స్వంతవిషయం గదా! దాన్ని ఆఫీసువిషయాలకు ముడి పెట్టేటంత నీచుణ్ణిగాను నేను. నేను మానవుణ్ణే, నాకూ దయ, కరుణ, సౌభ్రాతృత్వం, మానవత్వం అంటే ఏమిటో తెలుసు. నేను నీకు మొన్న సెలవు గ్రాంటు చెయ్యలేదా! చెయ్యకపోతే ఏమౌతుంది. నీకు సర్వీసులో బ్రేకుగాదా" అన్నాడు. గోపాలం బొందిలోకి కొంచెం ప్రాణులు చేరుకుంటున్నాయి. ఆఫీసరు ఏ ప్రళయకాల రుద్రుడో కనీసం ఏ "పరశురాముడో" అవుతాడనుకున్నాడు ఏమయినా మాట్లాడరాదనుకున్నాడు.

"నన్ను మీ రపార్థం చేసుకొంటున్నారు. చూడు మొన్న రామయ్య ఏం చేశాడో. నా కొంపమీదికి తెచ్చాడు. తప్పకూడే నంటాడు. పట్టేది. ఎకౌంట్లు అట్లా బనాయించి డబ్బు కాజేశాడు. నేను చూడకపోతే ఎవరి నెత్తికి చెప్పు? మీ బాధ్యత నా సంతకం పడటంతో వదుల్తుంది. నీమీద రిపోర్టు పంపుతా ననుకున్నావా? అవన్నీ నీకా రామయ్య వెంకటేశ్వరరావులు చెప్పిన మాటలేనా! మొన్న ఆ వెంకటేశ్వరరావు ఆఫీసులో ఎంతమంది పనిచేస్తున్నారో స్టేటుమెంటు రాయమంటే 14మందికి 10మంది అని వ్రాశాడు. నేను సంతకంపెట్టాను. నామీదికి వచ్చింది. అందుకే నే నడిగాను. ఏమిటని. మీరు చూశారుగా అన్నాడు. వాళ్ళందరికి నామీద కోపం. నేను ఈ ఊరు వచ్చిన తరువాత వాళ్ల జేబులు నిండడం లేదులే. అందుకని వాళ్లు నామీద ప్రచారం చేస్తున్నారు. వాళ్ళ వలల్లో నువ్వే గాదులే - నీ ముందువాళ్ళు గూడా పడ్డారు. కాని నీవు ఒకటి నేర్చుకో. ఏదన్నా అనుమానముంటే అది ఎదుటబడి మాట్లాడుకోటం మంచిదని. . ."

గోపాలం విన్నాడు. విస్తుబోయాడు. తను అనుకున్నదంతా తప్పే. ఎంత మాట లన్నాడు ఆఫీసర్ని! అపార్థం చేసికొన్నాడు. ఆఫీసరు సన్మార్గుడు. ఆ రామయ్యవాళ్లు ఎంత కపటులు అనుకున్నాడు. ఇంకా వంచినతల ఎత్తకుండానే ఆఫీసరుకు మొహం చూపకుండా వచ్చేశాడు. ★

# "సామిధేని" నుంచి

అబ్బూరి వరదరాజేశ్వరరావు

**1**

వర్షించు నదించే ప్రమాదాన్ని!
హర్షించు! సృజించకు ప్రమోదాన్ని
బహిరంతరాల్లోన! క్రమిస్తున్న
ముహూర్తం గమనించి భ్రమిస్తున్న
గతస్వప్నాకృతికి పలికించకు
కడసారి వీడ్కొలుపు! ఝుళిపించకు
అవధిచేరని ఆశయాల్ని పట్టి
ఆవరించని నిస్పృహాలోనెట్టి—

**2**

మృత్యువు కోటలో
చీకటి తోటలో
చిగురించిన హాసంలా
మృత్యువు వేటలో
చీకటి బాటలో
సకిలించిన మోసంలా
మృత్యువు మూటలో
చీకటి పేటలో
సవరించిన మెరుపుల్లా
మృత్యువు పాటలో
చీకటి మాటలో
వివరించని వెరపుల్లా
క్షయరోగపు దగ్గువలె
కాలని రాక్షసిబొగ్గువలె
సమీపిస్తున్నది ముహూర్తం
సముజ్వల సంవర్తం!
కంకాళపు టావలింతవలె
అహంకారపు జేగురింతవలె
సమీపిస్తున్నది ముహూర్తం
సముద్వాంత సంవర్తం!
కాలభైరవ సీరవరవంలా
రాలీరాలని ఉరితియ్యబడ్డ శిరంలా
సమీపిస్తున్నది ముహూర్తం
సమున్మీలిత సంవర్తం!
ఆకలితో అలసిపోయిన వ్యాఘ్రంలా
ఆవేశాల ఆక్రోశాల శీఘ్రంలా
సమీపిస్తున్నది ముహూర్తం
సముద్రిక్త సంవర్తం!

**3**

ఓ నీలగగనంవా! ఊశావా
ఉరుముల్ని; వెలుతుర్ని మేశావా
నీలోన జీవితం చూస్తాంవే
కాలాల జాతకం రాస్తాంవే
కవనానికి పొదులు తీరుస్తాం
కష్టాలకి చితుల్ని పేరుస్తాం
నీ తలంపున తన్మయతకు కరిగి
మా తరుణరక్తవాహినుల మరిగి
తొలి మృత్యుదర్శనం చేస్తాంవే
తులలేని మూర్ఛల్ని మోస్తాంవే!

**4**

ఉప్పొంగు మహోదధి మరణిస్తే
ఉప్పెనలు నిస్తబ్ధత కరుణిస్తే
చలిగాలి పసికందు లేడుస్తయి
తెలిమంచు కన్నీళ్ళు కారుస్తయి
కారణం చెప్పవా మరి మరణం!
మా రుణం తీర్చేందు కిది తరుణం
మహోదధి సాగించిన యీ రణం
మహీశ్వరి మాంగల్యపు తోరణం
తెంచేందుకుమాత్రం కాదయ్యా!
తెరచాప జీవితం చేదయ్యా
మానుమాత్రం? మాకీ సాగరం
రేకెత్తిన కోరికల జాగిలం!

**5**

ఎడతెరిపిలేని యీ యెడారి
ఎదకరిచి గాయపరచవేం?
అరుస్తుం దప్పుడయినా యిది
తెరుస్తుం దొక్కసారి తన హృది
ఓ శీతకాలపు చలిగాడ్పు!
మా శిథిల వసంతాక్రోశం